ప్రజాశక్తి
సోమవారం 1 జులై 2024
5
విజయనగరం

అమరావతి అభివృద్ధికి మొదటి అలవెన్సు

ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తనకు లభించే తొలినెల అలవెన్సులన్నింటితో కూడిన జీతాన్ని రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేస్తానని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం, అమరావతి రెండు ప్రాజెక్టులూ అభివృద్ధి జరగాలని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పదంలో నడిపించేందుకు వెంకటేశ్వర స్వామి సిఎంకు ఆశీస్సులు అందజేయాలని కోరుకున్నట్లు తెలిపారు.

ప్రజలను వైద్యులకు దూరం చేసే

ప్రభుత్వ విధానాలు మారాలి

- ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసి నాయుడు
- ప్రజాశక్తి ఆధ్వర్యాన డాక్టర్స్‌డే వేడుకలు
- ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

డాక్టర్స్‌డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు తిరుమల ప్రసాద్, జెసి నాయుడు, చిట్టి రమణారావు, సిరీన్, మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు రవికుమార్, ప్రజాశక్తి మేనేజర్ కామినాయుడు, స్టాఫర్ రమేష్‌నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు వైద్యులను దూరం చేసే ప్రభుత్వ విధానాలు మారాలని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జెసినాయుడు అన్నారు. వైద్యవృత్తిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ ఆదివారం తిరుమల-మెడికవర్ ఆస్పత్రి కాన్ఫరెన్సు హాలులో ఘనంగా జరిగింది. ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా వైద్య పితామహుడు బిసి రాయ్ చిత్రపటానికి డాక్టర్ జెసినాయుడు, డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ చిట్టి రమణారావు తదితరులు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులను ప్రజాశక్తి ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ జెసి నాయుడు మాట్లాడుతూ బెంగాల్‌కు చెందిన సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ (బిసి రాయ్) వైద్యులుగా, రాజకీయ నాయకులుగా ప్రజలకు సేవలు అందించారన్నారు. డాక్టర్‌గా ఉన్న ఆయనకు భారతరత్న ఇవ్వడం వైద్యులందరికీ గర్వకారణ మన్నారు. మనిషి పుట్టిన నుంచి చనిపోయిన వరకు వైద్యులతో సంబంధం ఉంటుందన్నారు. వైద్యులను ఒత్తిడికి గురి చేయకుండా డాక్టర్, రోగులు సంబంధం గౌరవంగా సాగాలన్నారు. వైద్య వత్తిని, వైద్యులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు, డాక్టర్లకు మధ్య దూరం పెరుగుతోందన్నారు. అటువంటి విధానాలను ప్రభుత్వాలు విడనాలని కోరారు. మేథావులైన వైద్యులను ప్రభుత్వాలు వైద్యులను సలహాదారులుగా ఉంచాలన్నారు. టీచర్స్, గ్రాడ్యుయేట్ మాదిరిగా డాక్టర్లకు కూడా ఎమ్మెల్సీ పదవులు కేటాయించాలని కోరారు.

వెంకటరామా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ చిట్టి రమణారావు మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాశక్తి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తోందని, అందులో భాగంగా డాక్టర్స్‌డే నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాక్షించారు.

తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమలప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోను, , రాష్ట్రంలోను వైద్య రంగానికి. కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. సామాజిక దృక్పథంతో తమ ఆస్పత్రి ఆధ్వర్యాన 450 మెడికల్ క్యాంపులు నిర్వహించామని, బిపి, సుగర్, ఊబకాయంపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. కరోనా సమయంలో వైద్యులు ఎనలేని సేవలందించారని తెలిపారు. ముందు జాగ్రత్తలతోనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడు కోగలమన్నారు. కరోనా సమయంలో ప్రజలకు ప్రజాశక్తి, ప్రజాసంఘాలు చేసిన సేవలు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిరీన్ మాట్లాడుతూ తమ సీనియర్ వైద్యులే తమకు మార్గదర్శకమని అన్నారు.

ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ వైద్యుల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల మధ్య సత్కరించడం ద్వారా వారు చేసిన సేవలకు గుర్తింపు ఉంటుందన్నారు. వైద్యులపై భౌతిక దాడులు సరికాదని, ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని గ్రహించాలని తెలిపారు. నాసిరకం మందులు, సరైన మిషనరీ లేకపోవడం వలన ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందడంలో ఆలస్యం అవుతుంది తప్ప వైద్యుల తప్పు కాదన్నారు. ప్రజలకు సేవలు చేసే వైద్యులను కాపాడుకోవాలన్నారు. ప్రజలకు సమీకృత ఆహారం అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. .

ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు మాట్లాడుతూ ప్రజాశక్తి నిత్యం ప్రజా దృక్పథంతో పనిచేస్తోందన్నారు. వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, విపత్తులు సంభవించే సమయంలో విరాళాలు సేకరించి ఇవ్వడం వంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సమాజ గమనానికి దిక్సూచి గా నడుస్తుందన్నారు. సేవా దృక్పథంతో ప్రజలకు తిండి, గూడు,గుడ్డ అవసరాన్ని పాలకులకు తెలియజేసే వార్తలు రాయడం జరుగుతుందన్నారు. ఈ ప్రయాణంలో ప్రజాశక్తికి సహకరిస్తున్న వైద్యులు, తదితర అన్ని వర్గాల వారికి ధన్యవాదాలు తెలిపారు. కె.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో ప్రజాశక్తి ముందుకు సాగుతోందన్నారు ప్రజాసమస్యలపై వార్తలు రాయడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా వైద్యుల సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక సంచికను తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి ఉద్యోగులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు, ప్రజాశక్తి సిబ్బంది

నేటి నుంచి రూ.4వేల పింఛను

- బకాయిలతో సహా ఎన్‌టిఆర్ భరోసా చెల్లింపు
- 2,81,713 మంది లబ్ధిదారులకు రూ.186.87 కోట్లు చెల్లింపు
- ఉదయం 6 గంటల నుంచే ఇంటింటి పంపిణీ
- విజయనగరంలో మంత్రి శ్రీనివాస్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేసిన పింఛన్ల పెంపు జులై 1 నుంచి అమల్లోకి వస్తోంది. సోమవారం ఉదయం 6 గంటల నుంచే పెరిగిన పింఛను ఇంటింటి పంపిణీ ప్రారంభమవుతుంది. దీనికోసం జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోగల మున్సిపల్ స్కూలు సమీపంలో రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి ప్రారంభిస్తారు. కలెక్టర్ అంబేద్కర్, ఇతర అధికారులు పాల్గొంటారు. సచివాలయ సిబ్బందితోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికీ వచ్చి పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నారు. మొదటిరోజే లబ్ధిదారులందరికీ పింఛను అందించేందుకు ప్రణాళికను రూపొందించారు.ఎన్‌టిఆర్ భరోసాగా పేరు మారిన ఈ పథకం కింద చెల్లించే సామాజిక పింఛను మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచారు. పింఛన్ పెంపును 2024 ఏప్రిల్ నుంచి వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయడంతో, మూడు నెలల బకాయితో కలిపి, ఈనెల ఒకేవిడతగా రూ.7వేలు చెల్లించనున్నారు. ఈ ఎన్‌టిఆర్ భరోసా పథకం ద్వారా జిల్లాలో 2,81,713 మంది పేదలకు లబ్ధి చేకూరుతోంది.

పింఛను పెంపు వల్ల వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులు, రంగస్థల కళాకారులు, హిజ్రాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. వీరికి మూడు నెలల బకాయిలతో కలిపి పింఛను అందనుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వికలాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేలు నుంచి ఏకంగా రూ.6వేలకు పెంచారు. వీరికి కూడా నేటి నుంచి ఈ పెంపు వర్తిస్తుంది. పూర్తిగా అంగవైకల్యం (మంచం, కుర్చీకి పరిమితమైనవారు) ఉన్నవారికి, బోదకాలు వ్యాధిగ్రస్తులు, కిడ్నీ, కాలేయ మార్పిడి జరిగినవారికి ఇస్తున్న నెలవారీ పింఛను రూ.5వేలు నుంచి రూ.15వేలకు పెంచారు. జిల్లాలోని మొత్తం 15 కేటగిరీలకు చెందిన 2,81,713 మంది పింఛన్ దారులకు, గత మూడు నెలల బకాయిలతో కలిపి సుమారు రూ.186.87 కోట్లు పంపిణీ చేయనున్నారు. సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఈ పంపిణీ జరగనుంది. పింఛను పంపిణీ కార్యక్రమంలో సుమారు 5,420 మంది ప్రభుత్వ సిబ్బంది భాగస్వాములు కానున్నారు. ఒక్కో ఉద్యోగి సుమారు 50 నుంచి 60 మంది ఇళ్లకు వెళ్లి పింఛను అందజేస్తారు. పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొంటారు.

పంపిణీకి ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

జిల్లాలో సోమవారం ఉదయం 6 గంటలు నుంచే పింఛను పంపిణీ ప్రారంభమవుతుంది. దీనికోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. పింఛను సొమ్ము కూడా ఆయా అధికారులవద్ద ఇప్పటికే పంపిణీకి సిద్ధంగా ఉంది. మొదటిరోజే శతశాతం పంపిణీ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. దీనికోసం జిల్లా స్థాయిలో ఒక మోనటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి, పింఛను పంపిణీని పర్యవేక్షిస్తాం.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే లలితకుమారికి వినతినిస్తున్న విద్యుత్తు మీటరు రీడర్లు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్తు మీటర్ రీడర్ కార్మికులు ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు లక్కవరపుకోటలో ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు తొలుత శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు మీటర్ రీడర్ కార్మికులుగా గత 20 సవంత్సరాలగా విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్నామని, 2018లో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు తమ సమస్యలను వివరించగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అప్పటి ఇందన శాఖ మంత్రి కళా వెంకట్రావు విద్యుత్తు సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్లను -రీడింగ్‌తో పాటు బిల్ కనెక్షన్ కూడా చేస్తూ నెలరోజుల పనిని కల్పించే విధంగా జీవో ఇచ్చారని గుర్తు చేశారు. 2019లో గవర్నమెంట్ మారడంతో తమకు కష్టాలు మొదలయ్యాయని టిడిపి ఇచ్చిన జీవో పనిచేయదని రద్దు చేశారని చెప్పారు. రూ. 3.60 పై పెంచిన పీస్ రేటును తగ్గించడంతో పాటు తమకు రావలసిన అరకొర వేతనాల్లో కూడా వైసిపి కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. తమ మీద కక్ష సాధింపు చర్యలు చేపట్టి మీటర్ రీడర్లకు పని దినాలు తగ్గించి తమ కడుపు కొట్టారన్నారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెళ్లి తమకు ఉద్యోగ భద్రత కల్పించి నెలవారి వేతనాలు అమలు చేయాలని విన్నవించారు.

పదో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

నిరాహార దీక్ష చేస్తున్న జిందాల్ కార్మికులు

జిందాల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 10వ రోజుకి చేరాయి. జిందాల్ యాజమాన్యం లే ఆఫ్ పేరుతో కార్మికులను బయటికి నెట్టి నేటికి 45 రోజులు గడుస్తున్నా యాజమాన్యం కనీసక స్పందించుకోవడంపై కార్మికులు, కార్మికులు నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల పట్ల కనికరం చూపి, కంపెనీ తెరవాలని ఆందోళన వ్యక్తం చేశారు. 40 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులను ఎటువంటి కారణం లేకుండా లే ఆఫ్ పేరుతో కంపెనీ బయట ఉంచడం విచారకరమన్నారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు నాయకత్వంలో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిభావంతులకు చేయూతనందిస్తే విద్యారంగంలో ఉన్నత ఫలితాలు అందిస్తారని సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ఎస్ఎస్ రాజు అన్నారు. విశ్వ కళా పరిషత్, వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ, నా ఊరు విజయనగరం, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, తిలక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని సుమారు వంద మంది విద్యార్థులకు నోట్స్‌పుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌లు వంటి విద్యా ఉపకరణాలు పంపిణీ చేశారు. యూత్ హాస్టల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్య చదవాలని ఉద్బోదించారు. కార్యక్రమంల పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరించారు. చింతలపూడి త్రినాధరావు ముళ్ళపూడి సుభద్ర దేవి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సిలో ఉపాధ్యాయ పోస్టులు పెంచాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో డిఎస్‌సి ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు వై.రాము డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ కార్యకర్తల సమావేశం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌పి ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఎస్‌జిటి సంఖ్య తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, ఉమ్మడి జిల్లా నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గతప్రభుత్వం మూసివేసిన పాఠశాలలను తెరిపిస్తే ఈ పోస్టుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. గత ఏడేళ్లగా డిఎస్‌సి లేనందున వయోపరిమితిని 47సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే కాకుండా ఇతర ప్రభుత్వశాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏడాది 2కోట్ల ఉద్యోగాలు పేరిట మోసం చేశారని అన్నారు. సమావేశంలో జిల్లాలోని నూతన కన్వినింగ్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సిహెచ్ హరీష్, కో-కన్వీనర్‌గా బి.సతీష్, టి.నాయుడు, ఎం.గణేష్, సభ్యులుగా తిరుపతి,జయరాం, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

- మలేరియా నివారణకు ప్రత్యేక దృష్టి
- 113 గ్రామాలు హైరిస్క్‌గా గుర్తింపు
- రోగాల నివారణపై ప్రజలకు అవగాహన
- కేన్సర్ రోగులను గుర్తించేందుకు క్షేత్రస్థాయి సర్వే
- 'ప్రజాశక్తి'తో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. మలేరియా కేసులను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు వాటి పరిధిలోని 113 గ్రామాలను హైరిస్క్‌గా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. సీజన్ వ్యాధుల నివారణపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి



? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. వీటి నివారణకు ఇటీవలే జిల్లా కలెక్టర్, జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏర్పాటుచేసిన సమావేశంలో దశ దిశ నిర్దేశించారు. వారి ఆదేశాలు, సూచనల ప్రకారం గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాం. ముఖ్యంగా మురుగునీటి కాలువలు, నీరు నిల్వవున్నచోట్ల బ్లీచింగ్ పిచకారీ చేస్తున్నాం. ఈ విషయంలో పంచాయతీలు, గ్రామీణ నీటి సరఫరా విభాగాలతో కలిసి పనిచేస్తున్నాం.

? మలేరియాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుంటున్నారు?

మలేరియా కేసులు ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నమోదవుతున్న మలేరియా కేసుల్లో ఐదు (కొట్టాం, చల్లపేట, ఆరికతోట, పెదమజ్జిపాలెం, డికె పర్తి) పిహెచ్‌సిల పరిధిలోనే 65 కేసులు ఉన్నాయి. అందువల్లే వీటి పరిధిలోని 168 గ్రామాలపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఇందులోనూ 113 గ్రామాలను హైరిస్క్‌గా గుర్తించి వైద్య బృందాలను అందుబాటులో ఉంచాం. అదనంగా పది మందిని ఇతర ప్రాంతాల నుంచి డిప్యుటేషన్‌పై అక్కడికి పంపాం.

? ఏజెన్సీలో మలేరియా కేసులు ఎందుకు ఎక్కువగా ఉంటున్నాయి?

సాధారణం గా దట్టమైన అడవులు, తుప్పలు, డొంకలు, నీరు నిల్వవుండే ప్రాంతాల్లో ఎక్కువగా దోమలు వృద్ధి చెందుతాయి. దీనికితోడు అటవీ ప్రాంత గిరిజనులకు కాస్త అవగాహన తక్కువగా వున్న ఉండడం వల్ల దోమకాటు నుంచి తప్పించుకునే అవకాశాలు తక్కువ. ఇందువల్ల ఎక్కువగా ఏజెన్సీలో మలేరియా ముప్పు ఉంటుంది. దీనికితోడు మలేరియా రోగిని కుట్టిన దోమ, వేరొకరిని కుట్టినా వ్యాప్తి చెందుతుంది. ఈ రకమైన కేసులు కూడా ఎక్కువగానే ఉన్నట్టు తమ పరిశీలనలో ఉంది.

? కేన్సర్‌పై స్క్రీనింగ్ సర్వే ఎలా సాగుతోంది?

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సగటు మనిషి జీవన విధానంలో వచ్చిన మార్పులు, వాటి వల్ల కలుగుతున్న లాభ నష్టాలను వివరించేందుకు ప్రభుత్వం నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసేందుకు కృషిచేస్తోంది. రకరకాల కేన్సర్ జబ్బులు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతోపాటు కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించేందుకు జిల్లాలో ప్రత్యేక బృందాన్ని తయారు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు 724 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. వీరంతా క్షేత్ర స్థాయిలో జనాలకు అవగాహన కల్పిస్తారు. అవసరమైన వారిని ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు.

ఎమ్మెల్యేను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

అన్ని రంగాలూ నిర్వీర్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

గత వైసిపి పానలో అన్ని రంగాలనూ నిర్వీర్యం చేశారని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఆదివారం విజయనగరం మండల కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ జి.వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు మండల సభ్యులంతా ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేయాలని అన్నారు. నేడు మండలంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నిస్తున్నారని, దీనికి గత ప్రభుత్వ తీరే కారణమని అన్నారు. తాగునీరు, వైద్యం, వ్యవసాయంపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలపై దృష్టి సారించాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పురోగమనంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తు న్నారని తెలిపారు. సమావేశంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, బియ్యాల పేట సర్పంచ్ పడగల అబద్ధం, చెల్లూరు సర్పంచ్ కల్లేపల్లి ఆదినారాయణ, జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, రాకోడు ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు చెల్లూరు ఎంపిటిసిబి .శంకర్రావు, అధికారులు పాల్గొన్నారు·

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు నాటుతున్న మొక్కలను సంరక్షించాలని కోరారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బెల్ట్ సొసైటీ పని చేస్తుందన్నారు. గత కొన్నేళ్లుగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది విస్తృతంగా మొక్కలు నాటేందుకు తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ కోశాధికారి శర్మ, సభ్యులు కె.కృష్ణదాసు, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ పాల్గొన్నారు.

సిఎంను కలిసిన సుహాసిని

ప్రజాశక్తి- డెంకాడ

మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును చింతలవలస ఎపిఎస్‌పి బెటాలియన్‌కు చెందిన టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి చీకటి సుహాసిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- గంట్యాడ

బొండపల్లి మండలం చిన్న తామరపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ ఎం. భాస్కర్ నాయుడు వైసిపిని వీడి ఆదివారం గంట్యాడలోని మంత్రి శ్రీనివాస్ నివాసం వద్ద టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ మనమంతా తెలుగుదేశం పార్టీ కుటుంబమని ఐక్యమత్యంగా ఉండి పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని కోరారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ టిడిపి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 20వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో జగ్గయ్యపేట గ్రామానికి చెందిన మాచవరపు వీర్రాజు వినాయకుడి ప్రతిమలు తయారు చేసే పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తూ ఇటీవల కాలికి రంపం తగిలి గాయపడ్డాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వీర్రాజు మంచానికే పరిమితమ వడంతో కుటుంబం ఇబ్బందులు పడుతుందని గమనించిన గ్రామ పెద్దలు, యువకులు రూ. 20వేలు ఆర్థిక సాయాన్ని వీర్రాజుకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, రావాడ రామసత్యం(టీచర్), గొర్లె అవతారం(టీచర్), వంటాకు సూర్యనారాయణ(ఎల్‌ఐసి ఏజెంట్), నాలం కాసుబాబు, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన టిడిపి అభిమాని గొంప రమణ కుటుంబ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, బుచ్చి రాంప్రసాద్ దంపతులను సాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారికి ఫోటోను బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కసిరెడ్డి అర్జున, గొంప రమణ, జి దేవుడు నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నాబాబును పరామర్శించిన బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

విశాఖలో జరిగిన ప్రమాదంలో మరణించిన హేమంత్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పరామర్శించి ఓదార్చారు. తారకరామ కాలనీలోని హేమంత్ తండ్రి ఎన్నాబాబును బేబినాయన పరామర్శించారు. హేమంత్ మరణం ఎంతో బాధ కలిగించిందని బేబినాయన అన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

విద్యార్థుల నైపుణ్యతను గుర్తించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

విజేతలకు బహుమతులు ఇస్తున్న సూరిబాబు, చక్రి

విద్యార్థుల్లో నైపుణ్యతను గుర్తించడానికి ది లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధి తాలాడ దీప్తి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట గ్రామంలో మహాత్మా గాంధీ, నెహ్రూ చిల్డ్రన్ పార్లమెంటు ద్వారా విద్యార్థులతో టాలెంట్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, చతీష్‌గడ్ ప్రాజెక్ట్ మేనేజర్ కిస్మత్ నందా దంపతులు, టిడిపి యువ నాయకుడు గుర్రాన చక్రి, ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సూరిబాబులు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్య, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు ఆయన చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేని సంతపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జామి

ఎటువంటి లైసెన్స్, అనుమతులు లేకుండా మండలంలోని లోట్లపల్లి సంత జరుగుతుందని అధికారులు చర్యలు తీసుకోవాలని గాంధీ విగ్రహానికి వినతినిచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఫిర్యాదుచేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ప్రతి ఆది, సోమవారం పశువులు సంత నిర్వహిస్తున్నారని దీన్ని తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ సంతలో పశువులను అధిక రేట్లుకు పసు మాంస వ్యాపారులు కొనుగోలు చేస్తూ హింసాత్మాకంగా రవాణా చేస్తున్న అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా వారితో కుమ్మక్కు ఐపోయారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవిఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళ అధ్యక్షులు చోళ్ల రాజకుమారి పాల్గొన్నారు.

నేడు వాహనాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శృంగవరపుకోట పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం స్టేషన్ ఆవరణంలో బహిరంగ వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ అధికారి మురళి రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సమక్షంలో ఈ వాహనాలను వేలం వేస్తామన్నారు. ఆసక్తి గలవారు బహిరంగ వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చునని ఆయన తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

శృంగవరపుకోట: గ్రామసభల నిర్వహణకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి సూర్యారావు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ గ్రామసభలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13,372 గ్రామపంచాయతీలో జులై ఒకటో తేదీ నుంచి జరగనున్నవని ఈ గ్రామ సభలకు ఓటు హక్కు కలిగిన వారందరూ గ్రామ సభకు తప్పనిసరిగా హాజరై గ్రామసభలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని చెప్పారు. గ్రామ సభలు విజయవంతంగా జరగాలంటే రాష్ట్రంలో ఉన్న డిఎల్‌పిఒలు, ఇఒపిఆర్‌డిలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామసభ సక్రమ నిర్వహణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. గ్రామసభ తీర్మానం లేనిదే గ్రామ పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఏవి చేపట్టడానికి వీల్లేదని, కాబట్టి అత్యంత విలువైన గ్రామసభల విజయవంతానికి ఇటు ఓటర్లు అటు పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు కృషి చేయాలని కోరారు.

కొట్లాటపై కేసు నమోదు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోవీలు పర్తి గ్రామంలో గత కొంత కాలంగా పత్రి వెంకటరావు, గ్రామ పెద్ద సేనాపతి అప్పారావు మధ్య ఇంటి జాగా, క్రషర్ వద్ద స్థల వివాదం కొనసాగుతుంది. ఇరువురి ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్.ఐ.రాజేష్ శనివారం కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఇంటికి వెళ్ళిన తర్వాత పత్రి వెంకటరావు ఇంటిపైకి సేనాపతి అప్పారావు, పడాల జోజి బాబు, పచ్చికూర అప్పలనాయుడు వెళ్లి ఇంట్లోకి చొరబడి వెంకటరావును రామాలయ వద్ద పడేశారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనం వైద్య సేవలు నిమిత్తం ఎస్ కోట ప్రభుత్వ ఆసుపత్రికి వెంకటరావును తరలించారు. వల్లంపూడి ఎఎస్ఐ వెంకటేష్, వెంకట్రావు వద్ద స్టేట్‌మెంట్ తీసుకొని ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వెంకట్రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మూడు వార్డులకు ఒకటే సామూహిక మరుగుదొడ్డి

- సెప్టిక్ ట్యాంకు నిండిపోయి బయటకు వచ్చేస్తున్నా పట్టని అధికారులు
- కంపు నుంచి కాపాడాలంటూ లంకాపట్నం వాసులు వేడుకోలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తలుపులు లేకుండా అధ్వాన్నంగా ఉన్న మరుగుదొడ్లు

నగరంలోని లంకాపట్నంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో దుర్గంధం వెదజల్లి ఆ ప్రాంతవాసులు నరకం అనుభవిస్తున్నారు. నివాసాల మధ్య స్త్రీ పురుషులకు పదేసి చొప్పున ఇక్కడ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అనేక ఏళ్లుగా వాటి నిర్వహణను నగర పాలక సంస్థ అధికారులు, పాలకవర్గం పట్టించుకోపోవడంతో అధ్వానంగా మారాయి. వినియోగించు కోవడానికి సరిగ్గా లేకపోవడం, నీరు రాకపోవడం,సెప్టిక్ ట్యాంకు నిండి పోవడం, మల మూత్రాలు పైప్ ద్వారా బయట కాలువల్లోకి వచ్చేస్తుండటంతో ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు మరుగుదొడ్లు ఉన్న ప్రాంతం నుంచి 200 మీటర్లు వరకు దుర్వాసన వస్తుందంటే వాటి నిర్వహణ పట్ల పాలకులు,అధికారులు చిత్తశుద్ధి ఎలా ఉందో అర్థమవుతుంది. మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. ఈ ప్రాంతంలో నివాసాలు ఉన్న వారంతా పేదలు, దళితులు. వీరికి ఇళ్లలో మరుగుదొడ్లు లేవు. అందరికీ ఈ సామూహిక మరుగుదొడ్డే గతి. మూడు వార్డులకు చెందిన ప్రజలు మల మూత్ర విసర్జనకు ఆధారంగా ఉంది ఈ మరుగుదొడ్డి. ప్రజలు వచ్చి మల మూత్ర విసర్జన చేసి వెళ్లిపోవడం తప్ప వాటి పరిశుభ్రత పట్టించుకొనే వారు లేరు. కనీసం వారానికి ఒక సారి కూడా వచ్చి శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం,యాసిడ్ వేసి శుభ్రం చేయడం వంటి చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో మల మూత్ర లు కాలువ ద్వారా బయటకు వచ్చేస్తుండంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే పట్టించుకోకపోతే డయారియా ,అంటూ వ్యాధులు ప్రభలి రోగాలు బారిన ఆ ప్రాంత వాసులు పడే అవకాశం ఉంది.

నరకం నుంచి కాపాడండి

మరుగుదొడ్ల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక తిండి కూడా తినలేకపోతున్నాం. మరుగుదొడ్లు పాడై నీరు లేక, సెప్టిక్ ట్యాంకు నిండిపోయి మలముత్రాలు బయటకు వచ్చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. నరకమంటే ఏమిటో చూస్తున్నాం

సోము శ్రీను, లంకాపట్నం

మేమే శుభ్రం చేసుకుంటున్నాం

మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం వలన మేమే మరుగుదొడ్లను శుభ్రం చేసుకుంటున్నాం. ఎటువంటి నిర్వహణా లేదు. కనీసం యాసిడ్, పినాయిల్ వంటివి కూడా ఇవ్వడం లేదన్నారు. మున్సిపల్ కార్మికులు వచ్చి కాలువలు శుభ్రం చేసి వెళ్లి పోతున్నారు. దుర్వాసన వలన పిల్లలు, మేము రోగాలకు గురై చనిపోతామనే భయంతో ఉన్నాం. అధికారులు కాలుగుచేసుకొని మరుగుదొడ్లు బాగు చేసి,రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలి.

ఎస్.శివ, లంకాపట్నం

వ్యాయామంతో గుండె భద్రం

గుండె వైద్య నిపుణులు సునీల్ కుమార్

ప్రజాశక్తి-బొబ్బిలి

వ్యాయామంతో గుండెను భద్రంగా ఉంచుకోవచ్చునని నారాయణి హృదయాలయ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు పెంట సునీల్ కుమార్ అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా ప్రజాశక్తికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే గుండెను భద్రంగా ఉంచుకోవచ్చు. వాకింగ్, యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. స్మోకింగ్, గుట్కా, ఖైనీ, పాన్ మసాలా వంటి వాటికి దూరంగా ఉండాలి. అధికంగా మద్యం సేవిస్తే ప్రమాదం. కొలెస్ట్రాల్ (కొవ్వు) అధికమైతే గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కొలెస్ట్రాల్ పెంచే ఆహారానికి దూరంగా ఉండాలి. మధుమేహం నియంత్రణలో ఉంచుకోవాలి. అధిక బరువు ఉంటే తగ్గించుకోవాలి. వంశపారంపర్యం వల్ల గుండె పోటు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ డి3 లోపం ఉంటే తొందరగా మధుమేహం, గుండె వ్యాధులు వస్తాయి. విటమిన్ డి3 లోపాన్ని అధిగమించేందుకు ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి 9.30 మధ్యలో శరీరానికి ఎండ తగిలే విధంగా దుస్తులు ధరించి ఎండలో వ్యాయామం చేయాలి. ఐరన్ లోపం వల్ల ఆయాసం వచ్చి గుండెపై అధిక భారం పడటం వల్ల గుండె వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. థైరాయిడ్, విటమిన్ డి3, కొలెస్ట్రాల్ ఒకదానితో ఒకటి సంబంధం ఉండటం వల్ల ఒకటి మారితే మరో లోపం వచ్చే అవకాశముంది. కిడ్నీ వ్యాధి ఉన్న రోగులకు అధిక రక్తపోటు, ఆయాసం వస్తుంది. వీరు రెగ్యులర్‌గా డయాలసిస్ చేసుకోవడం వల్ల గుండె వ్యాధులను నివారించవచ్చు. పోస్ట్ కోవిడ్ వారు ఇన్‌ఫ్లామేషన్ అధికంగా ఉండడం వల్ల రక్తనాళాల్లో వాపు రావడం, కొలెస్ట్రాల్ పేరుకుపోవడంతో రక్తనాళాలు మూసుకుపోయి పక్షవాతం, గుండె జబ్బులు రావడానికి అవకాశం ఉంది.

గుండె వ్యాధి నివారణకు జాగ్రత్తలు

కరోనా బారిన పడిన వారిలో ఎక్కువ మందికి గుండె, మెదడు, కాలి రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల పక్షవాతం, గుండెపోటు వంటివి అధికంగా వస్తున్నాయి. అలా వచ్చిన వారికి త్రాంబలైసెస్ ఇంజెక్షన్ చేయడంతో సకాలంలో ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. నారాయణి హృదయాలయలో 8 మంది పక్షవాతం వ్యాధికి గురై కాలు, చెయ్యి, నోరు చొచ్చుబడిన రోగులు కోలుకుని యథాస్థితికి చేరుకుని సాధారణ స్థాయికి వచ్చారు. కరోనా బారిన పడిన వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. బిపి, మధుమేహం అదుపులో ఉంచుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తరచూ వైద్య నిపుణులను సంప్రదించాలి. వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఛాతిలో నొప్పి లేదా ఆయాసం, తల తిరగడం వంటి లక్షణాలు వచ్చినప్పుడు ఏదైనా పనిలో ఉంటే ఆ పని నిలిపివేసి వైద్య నిపుణులను సంప్రదించాలి. నిద్రలేమి, ఒత్తిడితో గుండె పోటు సమస్యలు అధికంగా వస్తాయి. ఆహారం నిర్ణీత వేళల్లో తీసుకోకపోవడం వల్ల కూడా గుండె వ్యాధులు వస్తాయి.

ఆహార జాగ్రత్తలు

గుండె వ్యాధుల నివారణకు ఆహార జాగ్రత్తలు చాలా అవసరం. ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, సన్నని పౌల్ట్రీ, చేపలను తీసుకోవాలి. ప్యాకేజ్డ్ ఫుడ్, చక్కెర ఉన్న స్నాక్స్, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఆహారంలో అధిక ఉప్పు, చక్కెర, అనారోగ్యమైన కొవ్వు పదార్థాలు ఉండకూడదు. వ్యాయామం, ఆహార అలవాట్లతో గుండె వ్యాధులను నివారించవచ్చు.

పెరుగుతున్న మధుమేహ రోగులు

గుండె, ఊపిరితిత్తుల వైద్యునిపుణులు డాక్టర్ ఎన్‌కె రావు

ప్రజాశక్తి - బొబ్బిలి

కరోనా అనంతరం మధుమేహ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, కోవిడ్ సోకిన వారికి షుగర్ స్థాయిలు బాగా పెరుగుతున్నాయని ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎన్‌కె రావు తెలిపారు. డాక్టర్స్ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

కోవిడ్ నిర్ధారణ అయ్యాక స్వల్పలక్షణాలే ఉన్నా, లక్షణాలేవీ లేకపోయినా వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో వచ్చిన సందేశాలను అనుసరించి మొదటి రోజు నుంచే స్టెరాయిడ్స్ వాడడం వల్ల మధుమేహం రోగుల్లో రక్తంలో గ్లూకోజ్ శాతం విపరీతంగా పెరుగుతోంది. ఇదివరకు మధుమేహం లేని వారికి కూడా కొత్తగా కనిపిస్తోంది. కోవిడ్ బారినపడి ఊపిరితిత్తులు ప్రభావమైన వారిలో సహజ లక్షణమైన సాగే గుణం కొంత మేర తగ్గుతుంది. దూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి. ఇమ్యూనిటీ పెంచుకోవడం కోసం మాంసాహారాన్ని అతిగా తీసుకోవడం మంచిది కాదు. దీంతోపాటు ఆకుకూరలు, కాయకూరలు, పాలు, పండ్లు అన్నీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మాంసాహారం మాత్రమే అధికంగా తీసుకోవడం వల్ల రక్తంలో కొవ్వుశాతం పెరిగి గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణులు డాక్టర్ సునీత

ప్రజాశక్తి-బొబ్బిలి

గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్నే తీసుకోవాలని, ఎలాంటి బయట తిండ్లు తినకూడదని ప్రసూతి, సంతాన సాఫల్య వైద్యనిపుణులు వి.సునీత అన్నారు. డాక్టర్స్‌డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడుతూ గర్భిణులకు పలు సూచనలు చేశారు. వివరాలు ఆమె మాటల్లోనే...

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పాలు, పండ్లు, గుడ్లు, మాంసం వంటి పౌష్టికాహారం తీసుకోవాలి. మొదటి మూడు నెలలు ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలి. ఈ మాత్రలు వల్ల పుట్టబోయే బిడ్డలో వెన్నెముక లోపాలను నివారించవచ్చు. గర్భిణులు హైబిపి, డయాబెటిస్ వంటి సమస్యలకు వైద్యుల సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షించుకోవాలి. బరువైన వస్తువులు మోయడం చేయకూడదు. దూరప్రయాణాలు చేయకపోవడమే మంచిది. పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు తాగిస్తే ఆరోగ్యంగా ఉంటారు. వైద్యులను సంప్రదించిన ప్రతిసారీ గర్భాదారణ సమయంలో బరువు, బిపి, శరీరం నుంచి కోల్పోయే ప్రోటీన్లను తెలుసుకునేందుకు మూత్ర పరీక్షలు చేయించుకోవాలి. బిడ్డ ఎదుగుదల, పరిశీలనకు స్కానింగ్ చేయించాలి. నిద్రపోయేటప్పుడు ఎడమ వైపు తిరిగి పడుకోవడం మంచిది. నొప్పులు వచ్చినా, ఉమ్మినీరు పోయినా, రక్తస్రావం జరిగినా బిడ్డ కదలికలు లేకపోయినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. తొలి మూడు నెలలు పూర్తయ్యేంత వరకు శృంగారానికి దూరంగా ఉండడం మంచిది. ప్రతి నెలా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

మధుమేహం దీర్ఘకాలిక వ్యాధి

జనరల్ ఫిజీషియన్ అజయ్‌కుమార్

ప్రజాశక్తి- గజపతినగరం

మధుమేహం దీర్ఘకాలిక వ్యాధి అని ఈ వ్యాధి వల్ల రక్తంలో చక్కెర శాతం పరిమితికి మించి చేరుకుంటుందని ఇది మానవదేహాన్ని ప్రధానంగా నేత్రాలు, మూత్రపిండాలు, మెదడు, గుండె, నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుందని శ్రీ రాఘవేంద్ర ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎ. అజయ్‌కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.. మధుమేహం రావడానికి వంశపారపర్యం, అధిక బరువు, శారీరక శ్రమ లేని జీవనశైలి, ధూమపానం, మద్యపానం, వయసు పైబడిన వారిలో వస్తుందన్నారు. ఈ వ్యాధి వచ్చినవాళ్లు ఉదయం పాలు, టీ, కాఫీ షుగర్ లేకుండా తీసుకోవాలన్నారు. అల్పాహారంగా నూనెను తక్కువగా ఉపయోగిస్తూ మొలకలు, ఇడ్లీ, దోస, చపాతి, వెజిటేబుల్ సలాడ్ వంటివి తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజ నంలో తగిన మోతాదులో అన్నం లేదా రోటీలు, పప్పు లేదా శాకాహార కూరలు, పెరుగు, మజ్జిగ తీసుకోవచ్చునన్నారు. ఈ షుగర్ వ్యాధి వచ్చిన వాళ్లు చక్కెర, స్వీట్లు, హల్వా, బర్ఫీలు, కేక్, చాక్లెట్లు, గ్లూకోజ్, తేనే, కూల్ డ్రింక్స్, ఆల్కహాల్, ధూమపానం, వేయించిన ఆహార పదార్థాలు పూరి, వడ, అప్పడాలు, పచ్చళ్ళు, అరటిపండు, మామిడి, సపోటా, ద్రాక్ష, మాంసం, రొయ్యలు పీతలు వంటివి అస్సలు తినకూడదన్నారు. వీటికి చాలా దూరంగా ఉండాలని, ఈ వ్యాధి లక్షణాలు అధిక మూత్ర విసర్జన, అధిక దాహం, ఆకలి ఎక్కువగా ఉండటం, గాయం మానక పోవడం బరువు తగ్గడం వంటివి కనిపిస్తాయని ఆయన చెప్పారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - భోగాపురం

కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే లోకం మాధవి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాకుళంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. జనసేన నాయకులు లోకం ప్రసాద్, కాకర్లపూడి శ్రీనివాసరాజు, మట్టా అయ్యప్పరెడ్డి, డిఎల్‌రెడ్డి, నర్సింగరావు, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు సవరవిల్లిలో పెన్షన్లను పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే

మండలంలోని సవరవల్లి గ్రామంలో ఎమ్మెల్యే లోకం మాధవి చేతుల మీదుగా సోమవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ చంద్రకళ తెలిపారు. ఈ పింఛన్లను ఉదయం 7 గంటలకు ఆమె పంపిణీ చేయనున్నారని ఆమె తెలిపారు.

భారాలకు సిద్ధమైన మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల్లో ఎన్‌డిఎ పార్టీలకు వేల కోట్ల రూపాయలు అంబానీ ఇచ్చారని వెంటనే అంబానీ రుణం తీర్చుకోవడానికి జియో ఛార్జీలు భారీగా పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఇది ప్రజలను మోసగించడమేనని సిపిఎం పార్టీ బొబ్బిలి పట్టణ కార్యదర్శి పి. శంకర్రావు అన్నారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాల యంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్‌ఎల్‌ను నాశనం చేసి ప్రజల కష్టార్జితాన్ని అంబానీకి కట్టబెట్టడానికి జియో చార్జీలు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. టెలికాం స్పెక్ట్రమ్‌లు చౌకగా టెండర్లు జియోకి కట్టబెట్టి ధరలు మాత్రం ఇష్టానుసారం పెంచుకోవడానికి మోడీ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్రంలో మోడీ ఎన్‌డిఎ ప్రభుత్వం దేశద్రోహానికి పాల్పడుతుందన్నారు. అప్పులు దేశ ప్రజలకి - సంపద అంబానీ, ఆదానీలకు మోడీ దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలు ప్రజల పక్షం ఉంటారా? మోడీ పక్షం ఉంటారా? ఆలోచించాలని ప్రశ్నించారు. దేశభక్తులైన ప్రజలందరూ జియో నుండి బిఎస్ఎన్ఎల్‌కు మారిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బి. యుగంధర్, వెంకటి పాల్గొన్నారు.

జియో ఛార్జీల పెంపును ఖండిస్తున్నాం: కాంగ్రెస్

జియో సంస్థ ధరలు భారీ స్థాయిలో పెంచడాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జియో సంస్థ ప్రారంభించిన తొలిరోజుల్లో అంబానీ అనేక ఆఫర్లు పెట్టి బిఎస్ఎన్ఎల్ వినియోగదారులను అటువైపు తిప్పుకుని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అండతో ఇష్టానుసారంగా ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. వెంటనే జియో వినియోగదారులంతా బిఎస్ఎన్ఎల్ వైపు మారిపోయి అంబానికి, మోడీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

హామీని నెరవేరుస్తున్న సిఎం

ప్రజాశక్తి- బాడంగి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లను పెంచి ఒకటో తారీఖను ఇంటి వద్దకే పంపిణీకి సిఎం చంద్రబాబు నాయుడు సిద్ధం చేస్తున్నారని ఇది పింఛనర్లకు పండగ వాతావరణమని ఎరుకులపాకల ఎంపిటిసి పాలవలస గౌరు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం జూన్ పింఛనతో పాటు ఏప్రిల్ నెల నుంచి పెంచిన పింఛను రూ.1000ను కలిపి ప్రతి పింఛనర్‌కు రూ.7వేలు ఇవ్వనున్నారన్నారు. ఉదయం 6గంటలకే సచివాలయ ఉద్యోగులు నేరుగా ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తారని చెప్పారు. దీంతో చాలా మంది బయట ఉన్న పింఛనర్లంతా ఇప్పటికే గ్రామాల్లోకి చేరుకోవడంతో పల్లెల్లో పండగ వాతావరణం నెలకొందని చెప్పారు.

ఎంపిపి తీరుపై సభ్యుల నిలదీత

- నిధుల కేటాయింపుపై వివక్షత చూపుతున్నారని మండిపాటు
- వాడీ వేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో పలువురు ఎంపిటిసిలు ఎంపిపి దొగ్గ సత్యవంతుడు తీరుపై నిలదీశారు. మండల పరిషత్తు అభివృద్ధికి సంబంధించిన నిధులు 14 మంది ఎంపిటిసిలకు ఇవ్వడంలో ఎంపిపి వివక్షత చూపుతున్నారని ఎంపిపిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరిగిపాలెం, సింగరాయి, నీలకంఠ రాజపురం అగ్రహారం, బానాది గ్రామాలకు చెందిన ఎంపిటిసిలు ఎంపిపిపై ఆగ్రహించారు. ఎంపిపి తన ఇంట్లో డబ్బులు అభివృద్ధికి ఖర్చుచేస్తున్నట్లు భావిస్తున్నారని కొంత మందికి నిధులు కేటాయించి కొంత మందికి కేటాయించకపోవడం ఏంటని బానాది ఎంపిటిసి గొంప తులసి ప్రశ్నించారు. నిధులు కేటాయింపులో మిగతా వారికి ఎందుకు ప్రాధాన్యత తగ్గించారో చెప్పకపోతే సమావేశాన్ని వాకౌట్ చేస్తామని వైసిపి ఎంపిటిసిలు చినరాముడునాయుడు, అరిగిపాలెం రమణ, రాయవరపు రాజేష్ ఎంపిపిని నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక ఏఏ పనులకు నిధులు కావాలో తెలిపితే కేటాయిస్తామని ఎంపిపి హామీ ఇచ్చారు. ఇప్పుడు ఇచ్చిన మాట ప్రకారం నిధులు కేటాయించకపోతే వచ్చే సమావేశంలో తేల్చుకుంటామని ఎంపిటిసిలు హెచ్చరించారు. ఇఒపిఆర్‌డి ఉమా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఎంపిడిఒ నిశ్చల మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా సోమవారం గ్రామాల్లో పంపిణీ చేయనున్న పింఛన్ల కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మాజీ డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన్నరామనాయుడు, వైస్ ఎంపిపిలు, తహశీల్దార్ సత్యం, మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

బొండపల్లి: గ్రామాల్లో చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు ఏకరువు పెట్టారు. ఆదివారం ఎంపిపి చల్ల చలం నాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ స్థంబాలు విరిగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, ప్రజలకు అపాయం జరిగితే భాధ్యత ఎవరిదని ఎఇని ప్రశ్నించారు. ముద్దూరు, కిండాం అగ్రహారం, కనిమెరక, బి.రాజేరు గ్రామాలలో లోఓల్టేజ్ సమస్య అధికంగా ఉందని ఆయా గ్రామాల సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని ఎఇ శంకర్ బదులిచ్చారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాలలో వేసిన పైపులైన్ కారణగా రోడ్లు పాడయ్యాయని వీటిని సంబంధిత గుత్తేదారు మరమత్తులు చేయించాలని సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు తాళ్ళపూడి అప్పలనాయుడులు కోరారు. గెద్దపేట గ్రామంలో మంచి నీటి వాటర్ ట్యాంకు కట్టినా ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బొండపల్లి సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు తెలిపారు. మరికొద్దిరోజుల్లో రెండువ విడత జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సునీల్ తెలిపారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో మండలంలో ఖరీఫ్ కాలంలో 7500 ఎకరాల్లో రైతులకు కావలసిన వరి విత్తనాలు పంపిణి చేస్తున్నామని ఎఒ పివి.మల్లిఖార్జునరావు తెలిపారు. ఎం.కొత్తవలస గ్రామంలో పాత పంచాయతీ భవనంలో అంగన్వాడి కేంద్రం నిర్వహిస్తున్నారని, ఖాళీ చేయమని రాతపూర్వకంగా ఇచ్చామన్నారు. ఈ విషయంలో ఐసిడిఎస్ అధికారులు భాధ్యత తీసుకోవాలన్నారు. జూన్ ఒకటో తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎంపిడిఒ కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, తహశీల్దారు హనుమంతురావు, పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

నిధులు గురించి మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు